# కోరేగావ్ | దళితుల సుదీర్ఘ పోరాటం

**2017** డిసెంబర్ చివరలో, 2018 జనవరి 1న మహారాష్ట్రలోని పూణే జిల్లా-భీమా- కోరేగావ్ గ్రామంలోను, పరిసర ప్రాంతాలలో హిందూమతతత్వ శక్తులకు దళిత ప్రజానీకానికి మధ్య హింసాత్మక సంఘర్షణలు జరిగాయి. ఈ పరిణామాల క్రమం క్లుప్తంగా ఈ విధంగా వుంది:

1818 జనవరి 1న పీష్వా బాజీరావు- 2ను ఓడించిన యుద్ధానికి గుర్తుగా, ఈ యుద్ధంలో మరణించిన బ్రిటిష్ సైన్యం (వీరిలో 500 మంది మహర్లున్నారు) స్మృతిలో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ 200 సం॥ల క్రితం 1818లో భీమా-కోరేగావ్ గ్రామంలో ఓ, 'రణస్థంభాన్ని' నిర్మించింది. పీష్వా ఆధిపత్యాన్ని అంతమొందించిన ఈ యుద్ధానికి స్మారకంగా వున్న 'రణస్థంభాన్ని' 1917 జనవరి ఒకటో తేదీన డా॥బి.ఆర్. అంబేద్కర్ సందర్శించి, రణస్థంభాన్ని దళితజాతి గర్వించదగిన స్మృతి చిహ్నంగా ప్రకటించాడు. ఆనాటి నుండి ప్రతి సం॥రమూ జనవరి ఒకటో తేదీనాడు దేశంలోని వివిధ ప్రాంతాలనుండి దళితులు హాజరై ఇక్కడ సమ్మేళనం జరుపుకోవటం ఆనవాయితీగా మారింది. 1818 నాటి యుద్ధం జరిగి రెండువందల సం॥లు నిండుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని రణస్థంభం వద్ద భారీ సమ్మేళనానికి నిర్వాహకులు ఈ ఏడాది విస్తృత సన్నాహాలు చేశారు.

2017 డిసెంబర్ 27న భీమా-కోరేగావ్‌కు దగ్గరలోని వధు బద్రక్ గ్రామంలో గోవింద్ మహర్ సమాధివద్ద కొందరు ఒక శిలాఫలకాన్ని ప్రతిష్టించారు. 1689లో మొఘలుల చేతుల్లో చంపబడిన శంభాజీ వారసుడైన శివాజీ కుమారుని యొక్క అంతిమ సంస్కారాలను గోవింద్ మహర్ నిర్వహించాడని విశ్వసిస్తున్నట్లుగా ఆ ఫలకంలో పేర్కొన్నారు. శంభాజీ వారసుని అంతిమ సంస్కారాలను 'మహర్లు' కాకుండా 'మరాఠా'లే నిర్వహించారని నమ్ముతున్న కొంత మంది మరాఠాలు దీనిని జీర్ణంచేసుకోలేక పోయారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇరుపక్షాల వారూ తమతమ ఫిర్యాదులను అందజేశారు. అయితే, మరాఠాలకు - దళితులకు నడుమ విభేధాలను పెంచే అవకాశంకోసం ఎదురు చూస్తున్న హిందూమతతత్వశక్తులు, మరాఠాలకు -దళితులకు నడుమ ఉద్రిక్తతలను, కలహాలను రగిలించటానికి ఈ సంఘటనను ఒక నిప్పురవ్వ లాగా ఉపయోగించుకున్నాయి.

2017 డిసెంబర్ 31న, పూనేలోని 'శనివారవాడ ఫోర్టు'వద్ద దళితులు 'ఎల్గార్ పరిషత్ (సమరశంఖం)ను నిర్వహించారు. 1818లో పీష్వాబాజీరావు-2ను యుద్ధంలో ఓడించిన బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యం ఈ కోటలోనే బసచేయడం ఈ ప్రాంత విశిష్టత. జిగ్నేష్ మేవాని, రాధికావేముల, భీమ్ ఆర్మీకి చెందిన విజయ్‌రతన్ మరియు కబీర్ కళామంచ్‌కు చెందిన కళాకారులతో సహా అనేకమంది ప్రముఖ దళిత నాయకులు ఈ ఎల్గార్ పరిషత్‌కు హాజరయ్యారు. దళిత శక్తులన్నీ ఐక్యంగా వున్నాయని, తమపై జరిగే దాడులు, అత్యాచారాలను ఇంకెంత మాత్రమూ సహించబోమనే గట్టి సందేశాన్ని ఇవ్వటానికి ఇది సరైన స్థలంగా భావించిన దళిత నాయకులు సమ్మేళనానికి ఈ ప్రదేశాన్ని ఎంచుకున్నారు. ఉపన్యాసాలను, తమ విమర్శలను హిందూమతతత్వశక్తులపై, వారి ప్రభుత్వాలపై ఎక్కుపెట్టారు.

2018 జనవరి 1న రాళ్ళు, గాజుసీసాలు, ఇనుపరాడ్లు, కర్రలు చేబూనిన, కాషాయ జెండాలతోనున్న వెయ్యిమంది గుంపు భీమా- కోరేగావ్‌కు దళితులను చేరవేస్తున్న బస్సులపై దాడిచేశారు. వారు గోవిందమహర్ సమాధిని ధ్వంసం చేశారు. పది వాహనాలను తగుల బెట్టారు. నాలుగు గంటలపైగా హింస కొనసాగింది. ఈ దాడులలో 28 సం॥ల వ్యక్తి మరణించాడు. అక్కడేవున్న పాలనాధికారులు, పోలీసులు మౌన ప్రేక్షకుల్లా చూస్తుండిపోయారు.

దళితులపై దాడులు ఇక్కడికే పరిమితమైన స్వభావంకలవి కావు; హిందూ మతతత్వశక్తుల భారీ కుట్రలో ఇవి ఒక భాగం మాత్రమే. దళిత ప్రజానీకంపై దాడులు చేసి, మతతత్వ మంటలు రేపటంలో సిద్ధహస్తులైన, హిందూమతతత్వ శక్తులుగా పేరెన్నికగన్న సింగ్లి జిల్లాకు చెందిన శివప్రతిష్టాన్ హిందూస్థాన్‌కు చెందిన మనోహర్ శంభాజీ భిడే, బిజెపికి చెందిన మిలంద్ ఎక్బోటే, పూనేకి చెందిన సంస్థాన్ హిందూ అగడి మొదలైన వారంతా ఈ దాడులకు నాయకత్వం వహించారు. "భీమా - కోరేగావ్ హింస హిందూ మతతత్వ సంస్థలు సాగించిన చర్యలే. మహర్లకు(దళితులకు), మరాఠాలకు, నడుమ ఉద్రిక్తతలను రగిలించే పథకంతో సాగించినవే"నని 'మరాఠీ శంభాజీ బ్రిగేడ్'కు చెందిన సతీష్‌షిండే పేర్కొన్నారు.

భీమా - కోరేగావ్ ప్రాంతంలో గొడవలు, హింస నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వంయొక్క పట్టనితనం, నిర్లక్ష్యవైఖరులను నిరసిస్తూ డా॥బి.ఆర్. అంబేద్కర్ మనవడు మరియు 'భారిపా బహుజన్ మహాసంఘ్ పార్టీ' నాయకుడు ప్రకాష్ అంబేద్కర్, 'మరాఠా శంభాజీ బ్రిగేడ్'తో సహా వివిధ మరాఠా సంస్థలు 2018 జనవరి 3వ తేదీన బంద్‌కు పిలుపునిచ్చారు. దళితుల - మరాఠాల నడుమ తగవులను పెంచేందుకు హిందూమతతత్వశక్తుల కుట్ర ఫలితంగా ఈ హింస, అల్లర్లు జరగగా సంయుక్తంగా బంద్ పిలుపు నిచ్చినవారు దళితుల, మరాఠాల నడుమ ఐక్యతకోసం కృషిచేయాలని, హిందూ మతతత్వశక్తులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ఎక్కుపెట్టాలని దిశానిర్దేశంచేయటం గుర్తించదగినది. బంద్ పిలుపుకు మహారాష్ట్ర ప్రజానీకం చాలా సానుకూలంగా స్పందించారు. ముంబైలోని అనేక ప్రాంతాలలో జనజీవనం స్తంభించింది. పాఠశాలలన్నింటికీ ముందుగానే శలవు ప్రకటించారు. ప్రదర్శనకారులు నగరాన్ని, ప్రధాన రహదారులను, కీలక మార్గాలన్నింటినీ దిగ్బంధించారు. వేలాది షాపులు, హోటళ్ళు మూతబడ్డాయి. ఆటోలు, ట్యాక్సీలు, మెట్రో సర్వీసులు ఇతర వాహన రవాణా సదుపాయా లన్నీ నిలచిపోయాయి. ఆందోళనకారులు బృహన్

ముంబాయ్ ఎలక్ట్రిక సప్లై అండ్ ట్రాన్స్‌పోర్టు (బెస్ట్) సేవలను నిలిపివేశారు. పూనే, థానే, కొల్హాపూర్, నాగపూర్ వంటి పలు నగరాలలో కూడా బంద్ జరిగింది.

గత మూడున్నర సం॥లలో దళితులపై దాడులు, అత్యాచారాలు తీవ్రమయ్యాయి. కేంద్రంలోనూ, అత్యధిక రాష్ట్రాలలోనూ బిజెపి అధికారంలోకి రావటంతో, దళితులపై, మైనారిటీలపై మరింత దూకుడుగా, మొరటుగా హంతక దాడులు సాగించేందుకు తమకు మరింత ప్రోత్సాహం లభించినట్లుగా కులతత్వ వాద, హిందూమతతత్వశక్తులు భావిస్తున్నాయి. వారు గో సంరక్షకుల పేరుతో, భారతీయ సంస్కృతి, మంచి ఆహార అలవాట్లు, వేషధారణ నియమాలు, హిందూమతం తదితర అనేక ముసుగులు, సాకులతో ఈ దాడులన్నింటినీ సమర్థించుకుంటున్నారు. గుజరాత్‌లో జరిగిన దాడులవంటి అసంఖ్యాక దాడులను మనం గుజరాత్, యుపి, ఎంపి, కర్నాటక, రాజస్థాన్, హర్యానా, మొదలైన అనేక చోట్ల చూశాం. ప్రభుత్వాలన్నీ ఈ సందర్భాలన్నింట్లో మౌన ప్రేక్షకులుగా వుండటమేగాక, దాడులకు పాల్పడిన వారిపై కంటే బాధితులపైనే అధికంగా చర్యలు తీసుకుంటున్నాయి.

దేశంలో దళితులపై జరుగుతున్న దాడులకు, అత్యాచారాలకు వ్యతిరేకంగా నిరసనలు, ప్రతిఘటన పెరుగుతూండటాన్ని కూడా మనం చూడగలం. తరాలనుండి తమ తాత, ముత్తాతల లాగా అణగిమణిగి పడివుండే తుచ్ఛమైన, అవమానకరమైన, అణచివేతతో కూడిన ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులను ఆమోదించి, తదనుగుణంగా జీవించటానికి దళితులు- ముఖ్యంగా యువజనులు నిరాకరిస్తున్నారు. ఇది ఖచ్చితంగా ఆహ్వానించాల్సిన విషయం. వారంతా ఓ నూతన, మెరుగైన జీవితాన్ని కలగంటూ, దానికోసం వెదుకులాడుతున్నారు. ప్రత్యేకించి, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, వివిధ వృత్తుల పనిప్రదేశాలలో, జీవితంలోని అన్ని రంగాలలో సాధారణ దళిత యువజన ప్రజానీకం-ఆర్థిక, రాజకీయ అసమానతలు, వివక్ష మరియు అణచివేతలకు కారణాల గురించి, వాటిని అంతంచేసే మార్గాల గురించి చర్చలు సాగిస్తున్నారు. దోపిడీ పాలకవర్గాల దన్నుతోనున్న అగ్రకులతత్వ, హిందుమతతత్వ శక్తులకు వ్యతిరేకంగా వారు బయటకు వస్తున్నారు. తమందరి మధ్య పరస్పర సహకారం, సంఘీభావం అభివృద్ధిచేసుకోవలసిన అవసరాన్ని వారు లేవనెత్తుతున్నారు. ఒక్కో విభాగం సాగించిన పోరాటం, సాధించిన విజయాలనుండి వారు స్ఫూర్తిని పొందుతున్నారు. వివిధ విభాగాల పీడిత ప్రజల ఐక్యపోరాటాలు, వారి మధ్య ఐక్యత ఎలాంటి అద్భుతాలను సాధించగలదో వారు గమనిస్తున్నారు. ఇవన్నీ ఆహ్వానించదగిన పరిణామాలే.

దోపిడీకి గురవుతున్న పీడిత ప్రజలకు వ్యతిరేకంగా భారత పాలకవర్గాలు క్రూరమైన, నాజూకైన విధానాలను ఉపయోగిస్తున్నాయి. పాలకులకు కులవ్యవస్థ మరియు అగ్రకుల తత్వాలనేవి ఆర్థిక, సామాజిక అసమానత్వాన్ని సమాజంలో సుస్థిరపర్చే అనువైన సాధనాలు మాత్రమే కాదు; పీడిత ప్రజలను రెండు పరస్పర శత్రుసమూహాలుగా విభజించి, ఒక సమూహంపై మరొక సమూహాన్ని ఎగదోయటానికి మరొక సాధనం కూడా. మహారాష్ట్రలోని భీమా-కోరేగావ్‌లో హిందూమతతత్వశక్తుల ప్రయత్నాలన్నీ - దళితులపై దాడులకు పథకాల్ని రూపొందించి, నాయకత్వం వహించి, సాధారణ దళిత-మరాఠా ప్రజల నడుమ గొడవలను, ఉద్రిక్తతలను రాజేయటమే, ఈ నీచమైన క్రీడ వెనుకనున్న ఉద్దేశ్యం. మనదేశంలోని దోపిడీ పాలకవర్గ పార్టీలపట్ల-వాటి రంగులు, జెండాలు, టోపీలు ఏవైనా, 'కఠినమైన' లేదా 'నాజూకైన' హిందూ మతతత్వమైనా లేదా 'లౌకికవాదమై'నా 'ప్రజాస్వామిక'మైనా లేదా 'ప్రగతిశీలతత్వమై'నా, మరేదైనా-ఈ పార్టీలన్నీ సూత్రరీత్యా వాటి దోపిడీవర్గ ప్రయోజనాలు అనగా-భూస్వామ్య, దళారీ బూర్జువా, సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కనుగుణంగానే వ్యవహరిస్తాయని మనదేశంలోని పీడిత ప్రజలంతా ఎరుకతో, స్పష్టంగా వుండాలి. వారు ధరించే టోపీలన్నీ ఈ దోపిడీవర్గ ప్రయోజనాలను పరిరక్షించి, వాటికి సేవచేసే సాధనాలేనని గ్రహించాలి. భారత పాలకవర్గాల ప్రయోజనాలకు, విధానాలకు, ఎత్తుగడలకు వ్యతిరేకంగా తుదికంటా, ప్రభావశీలంగా, విజయం సాధించేవిధంగా ఎలా పోరాటం చేయాలనేది దళిత ప్రజానీకంతో సహా పీడిత ప్రజలలోని ప్రతి విభాగమూ పట్టించుకుని తీరవల్సిన అంశంగా ముందున్నది.

సమాజంలోని వివిధ విభాగాల ప్రజానీకం కొన్నిసార్లు విడిగానూ, మరికొన్నిసార్లు తమ ఐక్యపోరాటాల ద్వారా తమ సమస్యలకు పరిష్కారాన్నో లేదా కొంత తాత్కాలిక ఉపశమనా లనో పొందగలుగుతున్నారు. మహారాష్ట్రలో మరాఠాల, గుజరాత్‌లో పటేదార్ల ప్రయత్నాలు దీనిలో భాగమే. మహారాష్ట్రలో దళితులు తమపై సాగుతున్న అత్యాచారాలకు, కొనసాగుతున్న సామాజిక అసమానత్వానికి, వివక్షకు, అణచి వేతలతోపాటు క్రూరమైన అన్ని రూపాలలోనున్న కులవ్యవస్థను అంతమొందించటానికి పోరాటం చేయాలి. వాస్తవానికి ఇది అణచివేతను వ్యతిరేకించే వారందరి పోరాటం. ప్రస్తుత భూస్వామ్య, సామ్రాజ్యవాద ఆధిపత్య ఆర్థిక, సామాజిక, రాజకీయ వ్యవస్థ-అన్ని రూపాలలోని అణచి వేతలను అంతమొందించే పోరాట మార్గంలో ప్రధాన అవరోధమనే ప్రాథమిక సత్యాన్ని అర్థం చేసుకోవటం అత్యావశ్యకం. కనుక ప్రత్యేక అణచివేత రూపాలపై దళితులు పోరాటం సాగిస్తూనే, అదే సందర్భంలో, తప్పనిసరిగా, ప్రస్తుత దోపిడీ, అణచివేతలతో కూడిన సామాజిక వ్యవస్థను అంతమొందించి మనదేశంలో నూతన ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించే లక్ష్యంకోసం జరిగే పోరాటంలో భాగస్వాములు కావాలి. ఇది మాత్రమే-సామాజిక అసమానత్వానికి, వివక్షకు, అణచివేతలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని అర్థవంతంగానూ, ప్రభావశీలంగానూ చేయ గలుగుతుంది. ఈ ధోరణి పెరుగుతూవుండటం ఆహ్వాన సూచికగా వుంది.

ooooo